

అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ పథకానికి శుక్రవారం ఏలూరుకు చెందిన కేవీ ప్రభాకర్ కుమార్ రూ.1,11,116 విరాళాన్ని అందజేశారు.



మల్లన్నకు నృత్యార్చన

శ్రీశైలంటెంపుల్: స్థానిక నిత్యకళావేదికపై శుక్రవారం తిరుపతికి చెందిన కొండా రవికుమార్ బృందం వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,699
అవుట్ ఫ్లో	:10,132

న్యూస్‌రీల్

ప్రతిభా విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



కలెక్టర్‌ను కలిసిన మెడికల్ సీట్లు సాధించిన విద్యార్థులు

నంద్యాల(అర్బన్): 2024–25 విద్యా సంవత్సరంలో మెడికల్ సీట్లు పొందిన విద్యార్థులను జిల్లా కలెక్టర్ రాజకుమారి అభినందించారు. చిన్నటేకూరు ఐఐటీ, మెడికల్ అకాడమీలో శిక్షణ పొందిన మనోజ్, అబ్రహం, అరుణ్‌కుమార్, ఉమేష్‌కుమార్ మెడికల్ సీట్లు సాధించారు. ఈ సందర్భంగా వారు కలెక్టర్‌ను కలువగా వారికి ఆమె అభినందనలు తెలిపారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న ఈఓ పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి డి.పెద్దిరాజు అన్నారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం క్షేత్ర పరిధిలోని పలుచోట్ల మొక్కలు నాటారు. విభూతిమఠం, రుద్రాక్ష మఠం పరిసర ప్రాంతాల్లో చేపట్టిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఈఓ పాల్గొన్నారు. అలాగే రింగ్‌రోడ్డు ఇరువైపులా, ఆరుబయలు ప్రదేశాల్లో, దేవస్థానం ఉద్యానవనాలలో మొక్కలు నాటారు. ఉసిరి, తెల్లమద్ది, రావి, కదంబం, బాదం, చింత, నేరేడు, పనస తదితర మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ రమణమ్మ, సహాయ కమిషనర్ చంద్రశేఖరరెడ్డి, ఈఈ మురళీధర్‌రెడ్డి, ఉద్యానవన అధికారులు ఈశ్వరరెడ్డి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధికి విద్యార్థుల పాకెట్ మనీ



కలెక్టర్‌కు చెక్కును అందజేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు జూపాడుబంగ్లా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థుల పాకెట్ మనీ రూ.11,675 అందజేశారు. ఈ మేరకు శుక్రవారం ప్రిన్సిపాల్ శ్రీదేవి, వైస్ ప్రిన్సిపాల్ మూర్తిల ఆధ్వర్యంలో చెక్కును కలెక్టర్ రాజకుమారికి అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమామహేశ్వరప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

నానో ఎరువులతో ఆరోగ్యకర దిగుబడులు



డ్రోన్ ద్వారా మందుల పిచికారీపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

గోస్పాడు: నానో ఎరువుల వాడకంతో ఖర్చు తగ్గడంతో పాటు ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ అన్నారు. మండలంలోని దీబగుంట గ్రామంలో శుక్రవారం క్షేత్రస్థాయిలో వరి పైర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రోన్ ద్వారా నానో ఎరువులు, పురుగు మందుల పిచికారీపై క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా డ్రోన్–దీ దీ, రూరల్ ఎంటర్ ప్రెన్యూర్ పథకం ద్వారా ఇఫ్కో తరపున రూ.12 లక్షల విలువ చేసే డ్రోన్, ఇవి వెహికల్ గ్రామానికి చెందిన రైతు హుస్సేన్ వలికి అందజేశారు. ఈ డ్రోన్ ద్వారా ఇఫ్కో ఎరువులు, పురుగుమందులు పిచికారీ చేస్తే ఎకరాకు రూ.300 వరకు రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. గ్రామంలో రైతులు సాగు చేసిన వరి పైర్లను పరిశీలించి తెగుళ్లు, నివారణ పద్ధతులు, సస్యరక్షణ విధానం, నీటి యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ ఏడీఏ రామ్మోహన్ రెడ్డి, టెక్నికల్ ఏఓ అయూబ్‌బాషా, ఏఓలు స్వప్నికారెడ్డి, నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



టాప్ ర్యాంకర్లకు భవిష్యత్ కష్టం

మా నాన్న వెలుగు డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తారు. నేను బాగా చదివి డాక్టర్ కావాలన్నదే ఆయన కల. ఆయన ఆశయం మేరకు నేను చదువుతున్నాను. టెన్త్‌లో 480/500 (సీబీఎస్‌ఈ), ఇంటర్ మొదటి సంవత్సరంలో 422 మార్కులు సాధించాను. ఇప్పుడు ద్వితీయ సంవత్సరంతో పాటు నీట్ యూజీలోనూ మంచి మార్కులు సాధిస్తానన్న నమ్మకం ఉంది. తద్వారా నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ప్రభుత్వ మెడికల్ కాలేజీలో సీటు తెచ్చుకోవాలన్నదే నా ఆశయం. ప్రభుత్వ మెడికల్ కాలేజీలైతే మంచి ప్రొఫెసర్లు, సౌకర్యాలు, వసతులు ఉంటాయి. బాగా చదువుకునేందుకు అవకాశం కూడా ఉంటుంది. కానీ ప్రైవేటు కాలేజీల్లో ఇవేమీ ఉండవు. రోగులు సైతం అద్దెకు తీసుకొచ్చి ఉంచుతారని పలుమార్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఇలాంటి చోట్ల మాలాంటి వారికి ఎలా చదువు వస్తుంది. కాబట్టి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయాలన్న ఆలోచన మానుకోవాలి. – ఎస్.వజీహా, కర్నూలు





ప్రైవేటుపరం చేస్తే తీవ్రంగా నష్టపోతాం

మా నాన్న ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎంగా పనిచేస్తారు. నేను బాగా చదివి మంచి డాక్టర్ కావాలని, ఈ సమాజంలో ఉన్నత స్థానంలో నిలవాలన్నది ఆయన ఆశయం. టెన్త్‌లో 577 మార్కులు, ఇంటర్ మొదటి సంవత్సరం 429 మార్కులు సాధించాను. ఇప్పుడు ద్వితీయ సంవత్సరంతో పాటు నీట్ యూజీ పరీక్షలోనూ మంచి మార్కులు తెచ్చుకుని ఉత్తమ ర్యాంకర్‌గా మెడికల్ సీటు సాధించాలన్న నా కల. రాత్రింబవళ్లు కష్టపడి చదువుతున్నాను. నాకు మంచి ర్యాంకుతో సీటు వస్తే తప్పకుండా ప్రభుత్వ మెడికల్ కాలేజీలోనే చేరతాను. ఎందుకంటే అక్కడ చదివిన వారికే మళ్లీ పీజీ సీటు కూడా సులభంగా సాధించే అవకాశం ఉంటుంది. అక్కడ మంచి ప్రొఫెసర్లు, వసతులు, సౌకర్యాలు ఉండటంతో పాటు రోగులు కూడా ఉంటారు. వైద్యవిద్యను ఉత్తమంగా నేర్చుకునేందుకు అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇదే ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేస్తే మాలాంటి విద్యార్థులందరూ తీవ్రంగా నష్టపోతారు. ఈ విషయంలో ప్రభుత్వం పునరాలోచించి నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని ప్రభుత్వ కాలేజీలను ప్రారంభించాలి. – డి. షీమా అమన్, కర్నూలు

రేషన్ బియ్యం.. చీకటి వ్యాపారం

- సరిహద్దులు దాటుతున్న రేషన్ బియ్యం
- అక్రమ వ్యాపారులుగా అవతారమెత్తుతున్న అధికార పార్టీ నేతలు
- అడ్డుకోకుండా అధికారులపై నేతల ఒత్తిడి

➤ ఈ ఏడాది ఆగస్టు 12న నంద్యాల నుంచి కర్నూలు వైపు అక్రమంగా 120 బస్తాల రేషన్ బియ్యం లోడ్‌తో వెళుతున్న లారీని తాలూకా పోలీసులు ఆటోనగర్ వద్ద పట్టుకున్నారు. జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్ రాణా ఆదేశాల మేరకు వెల్దుర్తికి చెందిన శోభన్‌బాబు, జనార్దన్ తదితరులు అక్రమ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో లారీని సీజ్ చేసి అక్రమార్కులను అదుపులోకి తీసుకున్నారు.

➤ ఈ ఏడాది ఆగస్టు 14వ తేదీన నంద్యాల పట్టణం నుంచి అక్రమంగా తరలిస్తున్న 162 బస్తాల రేషన్ బియ్యాన్ని తాలూకా పోలీసులు వెంకటేశ్వరపురం వద్ద పట్టుకొని లారీని సీజ్ చేశారు. కర్నూలు జిల్లా హుసేనాపురానికి చెందిన చాంద్‌బాషా, మురళీమోహన్‌రెడ్డి, విజయరాజును అదుపులోకి తీసుకొని బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు.

➤ ఈనెల 15వ తేదీన నంద్యాల పట్టణం నుంచి 250 బస్తాల రేషన్ బియ్యంతో తరలి వెళ్తున్న లారీని టూటౌన్ పోలీసులు పట్టుకున్నారు. వాహనాల తనిఖీల్లో భాగంగా మున్సిపల్ కార్యాలయం వద్ద నంద్యాల నుంచి తెలంగాణ రాష్ట్రం జోగుళాంబ గద్వాల జిల్లాకు వెళుతున్న బియ్యం వాహనాన్ని పట్టుకొని పోలీసులు సీజ్ చేసి యజమానితో పాటు 8 మందిపై కేసు నమోదు చేశారు.



అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న లారీని నంద్యాల పోలీసు స్టేషన్‌కు తరలించిన దృశ్యం (ఫైల్)

నంద్యాల(అర్బన్): బియ్యం అక్రమ వ్యాపారాన్ని కొందరు అధికార పార్టీ నేతలు ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. పట్టుబడినా తప్పించుకోవచ్చనే ధీమాతో బియ్యం దందాను దర్జాగా నడుపుతున్నారు. ఇటీవల జిల్లాలో పలుచోట్ల పట్టుబడిన రేషన్ బియ్యం వాహనాల వెనుక అధికార పార్టీ నేతల హస్తం ఉండటమే ఇందుకు నిదర్శనం. మార్కెట్‌లో రేషన్ బియ్యానికి డిమాండ్ ఉండటంతో పలువురు బియ్యం అక్రమ రవాణాను ఆదాయ మార్గంగా మార్చుకున్నారు. పోలీసులు, విజిలెన్స్ అధికారుల కళ్లుగప్పి పక్క రాష్ట్రాలకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. నంద్యాల జిల్లాలో 5.41 లక్షల రేషన్ కార్డు దారులు ఉండగా 1,204 రేషన్ షాపుల ద్వారా ప్రతి నెల 1,604 టన్నుల బియ్యం సరఫరా అవుతుంది. ఉచిత బియ్యం పథకం కొందరు రేషన్ డీలర్లకు దళారులకు వరంగా మారింది. నంద్యాల జిల్లా కేంద్రంతో పాటు వెలుగోడు, నందికొట్కూరు, బనగానపల్లె, ఆళ్లగడ్డ, డోన్ తదితర నియోజకవర్గాల్లో టన్నుల కొద్దీ రేషన్ బియ్యం అక్రమంగా తరలివెళ్తోంది. ఈ బియ్యాన్ని పేదల వద్ద దళారులు తక్కువ ధరకు కొనుగోలు చేసి బ్లాక్ మార్కెట్లో విక్రయిస్తూ రూ.లక్షలు గడిస్తున్నారు. రేషన్ పంపిణీపై నిఘా ఉంచాల్సిన గ్రామ, మండల స్థాయి అధికారులు పట్టించుకోకపోవడంతో వ్యాపారులు యథేచ్ఛగా చీకటి బియ్యం బిజినెస్ చేస్తున్నారు. ఈ నెలలో కేవలం 20 రోజుల్లోనే అక్రమంగా తరలి పోతున్న 1,200 బస్తాల బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకోవడం చర్చనీయాంశమైంది. నంద్యాల ఎంఎల్ఎస్ పాయింట్ నుంచే నెలలో దాదాపు 300 క్వింటాళ్లు తరలిపోతున్నట్లు సమాచారం.

నేతల అండతో దర్జాగా దందా

అధికార పార్టీ బడా నేతల అండతో చోటా నేతలు బియ్యం అక్రమ వ్యాపారాన్ని దర్జాగా చేస్తున్నారు. మార్కెట్‌లో రేషన్ బియ్యానికి డిమాండ్ ఉండటంతో వీరి వ్యాపారం మూడు టన్నులు.. ఆరు లారీలుగా కొనసాగుతోంది. రేషన్ బియ్యాన్ని అధికంగా కోళ్లదాణ, లిక్కర్ తయారీ, రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో నేరుగా చోటా నేతలు రంగంలోకి దిగి అక్రమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నారు. బడా నేతల ఒత్తిళ్లతో అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండటంతో బియ్యం లారీలు సరిహద్దులు దాటుతున్నాయి. పోలీసులు, విజిలెన్స్ అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి వదిలేస్తున్నారు. అక్కడక్కడా పట్టుబడినా కేవలం వాహన డ్రైవర్ అరెస్ట్, బియ్యం సీజ్‌తో సరిపెడుతున్నారు. అక్రమ రవాణా వెనుక సూత్రధారులను పట్టుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

సివిల్ సప్లయ్ గోడౌన్ల నుంచే అక్రమాలు..

కార్డు దారులకు అందాల్సిన రేషన్ బియ్యం మొదట సెంట్రల్ వేర్ హౌస్ నుంచి జిల్లాలోని సివిల్ సప్లయ్ గోడౌన్‌లకు సరఫరా అవుతాయి. జిల్లాలో శ్రీశైలం, ఆత్మకూరు, నందికొట్కూరు, నంద్యాల, ఆళ్లగడ్డ, రుద్రవరం, కోవెలకుంట్ల, బనగానపల్లె, డోన్, ప్యాపిలి మండల కేంద్రాల్లో సివిల్ సప్లయ్ గోడౌన్లు ఉన్నాయి. ఈ గోడౌన్ల నుంచి చౌక దుకాణాలకు రేషన్ బియ్యం సరఫరా అవుతూ అక్కడి నుంచి ఎండీయూ వాహనాల ద్వారా కార్డు దారుల ఇళ్ల వద్ద పంపిణీ జరుగుతుంది. అయితే సివిల్ సప్లయ్ గోడౌన్లలోనే రేషన్ బియ్యం అక్రమాలు మొదలవుతున్నాయి. తూకాల్లో తేడాలు, వేయింగ్ మిషన్లలో మార్పులతో బియాన్ని కొట్టేస్తున్నారు. దీంతో డీలర్లకు రావాల్సిన బియ్యంలో కోత పడుతుంది. మిగులు బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌లు, బియ్యం తరలింపు కాంట్రాక్టర్లు కలిసి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఉచితంగా తీసుకున్న బియ్యాన్ని కార్డు దారులు ఇతరులకు విక్రయిస్తున్నారు. ఆ వాటిని బియ్యం కొనుగోలు దారులు దళారులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. అక్కడి నుంచి పొరుగు రాష్ట్రాలు, ఇతర జిల్లాలకు తరలించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కొంతమంది మిల్లర్లు పీడీఎస్ బియ్యాన్ని పాలిస్ చేసి సోనా మసూరి బియ్యంలో కల్తీలుగా విక్రయిస్తున్నారు.



పట్టుబడిన బియ్యాన్ని నంద్యాల ఎంఎల్ఎస్ పాయింట్‌లో దించుతున్న అధికారులు (ఫైల్)

బియ్యం అక్రమంగా తరలిస్తే చర్యలు



పేదలకు పంపిణీ చేసే బియ్యాన్ని ఎవరూ కొనుగోలు చేయకూడదు. పీడీఎస్ బియ్యం తరలిస్తున్నవారు పట్టుబడితే 6ఏ కేసులు నమోదు చేస్తాం. వ్యాపారులు మారో మారు బియ్యం వ్యాపారం చేయకుండా పకడ్బందీ చర్యలు చేపడుతాం. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాలకు ఎవరూ పాల్పడినా ఉపేక్షించేది లేదు.

– వెంకటరాముడు, డీఎస్ఓ, నంద్యాల

మూడు నెలల్లో..

☛ సెప్టెంబర్ 19న.. ఆళ్లగడ్డ పట్టణంలోని పాత కందుకూరు రహదారిలో విజిలెన్స్ అధికారులు దాడి చేసి అక్రమంగా తరలిస్తున్న 130 బస్తాల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని యాదవ వీధికి చెందిన నాగన్న అనే వ్యక్తి అక్రమ నిల్వ చేసినట్లు అధికారులు తేల్చారు.

☛ సెప్టెంబర్ 4న.. వెలుగోడుకు చెందిన ఇద్దరు వ్యక్తులు ఆటోలో ఎనిమిది క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారనే సమాచారం వచ్చింది. ఈ మేరకు పోలీసులు బండిఆత్మకూరు వద్ద దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఇద్దరిని అరెస్ట్ చేశారు.

☛ ఆగస్టు 14న.. జూపాడుబంగ్లా మండలం మండ్లెం గ్రామంలో అక్రమంగా నిల్వచేసిన 22 బస్తాల రేషన్ బియ్యాన్ని సీజ్ చేసి నందికొట్కూరు పట్టణానికి చెందిన గాజుల మహ్మద్ ముజిబ్ రహిమాన్‌ను అరెస్టు చేశారు.

☛ ఆగస్టు 7న.. ఆళ్లగడ్డ పట్టణ శివారులో ఓ గోదాములో నిల్వ ఉంచేందుకు తరలిస్తుండగా 450 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రుద్రవరం మండలం ముత్తలూరు గ్రామానికి చెందిన ప్రహ్లాదుడును అరెస్టు చేశారు.

☛ జూలై 25న.. బనగానపల్లె మండలంలోని నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని చెరువుపల్లె గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 23 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆటోను సీజ్ చేసి, ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు.

☛ జూలై 16న.. వెలుగోడు–నంద్యాల ప్రధాన రహదారిలోని రాజమాత రైస్ మిల్ సమీపంలో 130 బస్తాల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేశారు.



☛ జూలై 8న.. బనగానపల్లె మండలం బీరవోలు గ్రామంలో అక్రమంగా తరలిస్తున్న 40 ప్యాకెట్ల రేషన్ బియ్యాన్ని సీజ్ చేశారు. వాహన డ్రైవర్ సుహాన్, ధన్‌మోహన్‌పై కేసు నమోదు చేశారు.

ఇది నిర్లక్ష్య ప్రభుత్వం

- మంచి ప్రభుత్వ కార్యక్రమంలో టీడీపీ నేతల అధికార దర్పం
- వేదికపై చిన్న చిన్న నాయకులు.. ఎండలో అధికారులు

నంద్యాల(రూరల్): 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ నిర్వహిస్తున్న సభల్లో టీడీపీ నేతలు అధికార దర్పం చాడుతూ హడావుడి చేస్తున్నారు. ఈ క్రమంలో ఉన్నతాధికారులను అవమానించేలా వ్యవహరిస్తున్నారు. శుక్రవారం పట్టణంలోని నూనెపల్లెలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్ హాజరయ్యారు. కాగా వేదికపై వార్డు నాయకులతో పాటు చిన్న స్థాయి నాయకులు కూర్చున్నారు. దీంతో చేసేదేమి లేక అధికారులు వేదిక పక్కన ఎండలో కూర్చోవాల్సి వచ్చింది. వ్యవసాయ శాఖ ఏడీ రాజశేఖర్, మున్సిపల్ ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కమిషనర్ అంకిరెడ్డి, వివిధ శాఖల డీఈలు, ఏఈలు తీవ్ర ఇబ్బందికి గురయ్యారు. అలాగే వేదికపైకి జనసేన జిల్లా నేతలకు ఆహ్వానం లేకపోవడంతో తీవ్ర అసహనానికి గురై అక్కడి నుంచి వెళ్లిపోయారు. మంత్రి కుమారుడు ఫిరోజ్ వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా శాంతించలేదు.

మంత్రి బీసీ జనార్దన్‌కు సమస్యల స్వాగతం

కోవెలకుంట్ల: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలన పూర్తి చేసుకుని 'ఇది మంచి ప్రభుత్వం' అంటూ గ్రామాలకు వెళ్లిన మంత్రులు, అధికారులకు ప్రజల సమస్యల స్వాగతం పలుకుతున్నారు. శుక్రవారం కోవెలకుంట్ల మండలం గుళ్లదూర్తిలో నిర్వ హించిన సభకు ఆర్అండ్‌బీ, పెట్టుబడులు, మౌలిక వసతుల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్ రాజకుమారి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి, కలెక్టర్‌కు ప్రజలు పెద్ద ఎత్తున సమస్యలు విన్నవించారు.

➡ గ్రామంలోని బీసీ బాలుర వసతి గృహంలో మరుగుదొడ్లు, బాత్‌రూంలకు సంబంధించి ఒకే నీటి గుంత ఉండటంతో మురుగునీరు బయటకు వస్తూ దుర్వాసన వెదజల్లుతోందని గ్రామస్తులు మంత్రి దృష్టికి తెచ్చారు.



మండుటెండలో కూర్చున్న వ్యవసాయశాఖ ఏడీ రాజశేఖర్‌తో పాటు వివిధ శాఖల అధికారులు

➡ విద్యుత్ సమస్యలు తలెత్తితే ఆ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. లైన్‌మెన్లు అందుబాటులో ఉండటం లేదని, పెద్ద గ్రామం కావడంతో అదనపు హెల్పర్‌ను నియమించాలని కోరారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న వ్యవసాయ పనిముట్లు ప్రస్తుతం అందటం లేదని రైతులు వాపోయారు.

➡ అదనపు ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించి నీటి సమస్య పరిష్కరించాలన్నారు.

➡ గుళ్లదూర్తి– పొట్టిపాడు గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు మంత్రి దృష్టికి తెచ్చారు.

తిరుమల క్షేత్రంపైనా రాజకీయమే!

- ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



బొమ్మలసత్రం: రాజకీయాల కోసం పవిత్రమైన తిరుమల క్షేత్రాన్ని కూడా సీఎం చంద్రబాబు వాడుకోవడం దారుణమని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా విమర్శించారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ తిరుమల లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో వనస్పతి ఆయిల్ కలిసిందని నేషనల్ డెయిరీ ల్యాబ్‌లో ఫలితాలు వస్తే దాన్ని జంతువుల కొవ్వు ఉందని తప్పుదోవ పట్టించటం దురదృష్టకరమన్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని దేవునిపై ప్రమాణం చేస్తామని టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి చెబుతున్నా ఎందుకు పట్టించుకోవటం లేదన్నారు. 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబుకు దాదాపుగా 73 ఏళ్ల వయసున్నప్పటికీ విలువలతో కూడిన రాజకీయం చేయడం లేదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చక ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారన్నారు. నిరాధార ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తే ఊరుకోమన్నారు. హామీల అమలుకు ప్రజాక్షేత్రంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అరాచకం, విధ్వంసం, కక్ష సాధింపు చర్యలతో వంద రోజుల పాలన విజయవంతంగా నడిపిందని ఎమ్మెల్సీ విమర్శించారు.

విద్యుత్ కొత్త సర్కిళ్లకు గ్రీన్ సిగ్నల్

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ శాఖలో కొత్త సర్కిళ్ల ఏర్పాటుకు రాష్ట్ర విద్యుత్ శాఖ అనుమతులు ఇచ్చింది. రాష్ట్రంలో కొత్త జిల్లాలు ఏర్పాటు కావడంతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందించేందుకు కొత్త సర్కిళ్ల ఏర్పాటుకు విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి సీఎండీలు ప్రతి పాదనలు పంపారు. ఇందుకు రాష్ట్ర విద్యుత్ శాఖ అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు కార్యాచరణ చేపట్టి అదనపు ఖర్చులు లేకుండా సిబ్బందిని సర్దుబాటు చేసుకోవాలని ఆదేశించింది. విద్యుత్ శాఖ ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో 18 మంది ఏఈ, ఏఈఈల సాధారణ బదిలీ అయ్యారు. కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం ఉమ్మడి జిల్లా పరిధిలో బదిలీలు జరిగాయి. ఈ మేరకు చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

ఇంటిపైనే విద్యుదుత్పత్తి

- 'పీఎం సూర్యఘర్'తో సోలార్ ప్యానళ్ల ఏర్పాటు
- సబ్సిడీతో రుణ సదుపాయం
- జిల్లా వ్యాప్తంగా 505 దరఖాస్తులు

సోలార్ టాప్ సామర్థ్యం	నెలకు ఉత్పత్తి అయ్యే యూనిట్లు
ఒక కిలో వాట్	120
రెండు కిలో వాట్లు	240
మూడు కిలో వాట్లు	360

గోస్పాడు: ప్రజలు తమ ఇంటి నుంచే విద్యుత్ ఉత్పత్తి చేసుకుని వినియోగించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. భవిష్యత్తులో ప్రజలకు అవసరం మేరకు విద్యుత్ అందించేందుకు ప్రత్యామ్నాయ పద్ధతులు అనుసరించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ముఖ్యంగా గృహ విద్యుత్ వినియోగదారులు విద్యుత్‌ను ఆదా చేసుకునేందుకు ఈ పథకం వారికి ఎంతగానో ఉపయోగపడుతోంది. ఇందుకు ఆసక్తిగల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా 505 మంది విద్యుత్ వినియోగదారులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. విద్యుత్ అధికారుల ఆమోదంతో ఆయా గృహాలపై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేస్తారు. భవనం పైభాగంలో వంద చదరపు అడుగుల స్థలంలో సోలార్ రూఫ్ ప్యానళ్లు అమరుస్తారు. ప్రస్తుతం వాడే విద్యుత్ మీటర్ స్థానంలో నెట్ మీటర్ ఏర్పాటు చేసి, దీని ద్వారా సోలార్ విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని లెక్కిస్తారు. అలాగే ఇంటి అవసరానికి మించి కంటే ఎక్కువగా ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారు. ఇంటి పైకప్పుపై కనీసం 10 × 100 చ.మీ స్థలంలో 1కిలో వాట్ పవర్ సామర్థ్యం కలిగిన సోలార్ రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంది. ఈ పథకానికి తక్కువ వడ్డీకే బ్యాంకు రుణాలు అందిస్తున్నారు. వంద చదరపు అడుగుల స్థలంలో 120 యూనిట్ల ఉత్పత్తి చేసే ఒక కిలో వాట్ సామర్థ్యం గల రూఫ్ టాప్ ఏర్పాటు చేసుకోవచ్చు. దీనికి సుమారు రూ.60 వేలు ఖర్చు అవుతుంది. ఇందులో రూ.30వేలు కేంద్ర ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. మిగిలిన మొత్తాన్ని వినియోగాదారులు బ్యాంకు నుంచి రుణం తీసుకునే వెసులుబాటు కల్పించింది. ప్యానళ్లు ఏర్పాటు చేసిన తర్వాత రెండు నెలల లోపే సబ్సిడీ జమవుతుందని చెబుతున్నారు. అందుకు అవసరాన్ని గుణంగా వినియోగదారులు తమ బ్యాంకు ఖాతాలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. మూడు కిలో వాట్స్‌లోపు సర్వీసులకు ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన అవసరం లేదు.



ఇంటిపై ఏర్పాటు చేసుకున్న సోలార్ ప్యానళ్లు

సద్వినియోగం చేసుకోవాలి



సూర్యఘర్ పథకాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి. సోలార్ ద్వారా ప్యానల్ ఏర్పాటుకు ప్రభుత్వం రాయితీ ఇస్తుంది. ఇందుకోసం రుణ సదుపాయం కల్పిస్తోంది. వినియోగదారులే సోలార్ విద్యుత్ ఉత్పత్తిని చేసుకోవచ్చు. నెట్ మీటర్ విధానం ద్వారా విద్యుత్ ఉత్పత్తి వాడకం తెలుసుకోవచ్చు. ఈ పథకంపై వినియోగదారులకు సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రీనివాసులరెడ్డి, విద్యుత్ శాఖ ఈఈ, నంద్యాల

క్లుప్తంగా

24 నుంచి 'పొలం పిలుస్తోంది'

కర్నూలు(అగ్రికల్చర్): వాయిదా పడుతూ వస్తున్న 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఎట్టకేలకు ఈ నెల 24 నుంచి డిసెంబర్ 31 వరకు నిర్వహించనున్నారు. వారంలో మంగళ, బుధవారాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి శుక్ర వారం విలేకర్లకు తెలిపారు. ప్రతి రోజు రెండు గ్రామాలు చొప్పున.. ఉదయం 8.30 గంటల నుంచి 4 గంటల వరకు ఒక గ్రామం, మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల పాటు మరో గ్రామంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రతి సబ్ డివిజన్‌కు ఏడీఏ, ఏవోలతో ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. కార్య క్రమ నిర్వహణకు ప్రతి మండలానికి వాహన సదుపాయం కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు.

అక్రమంగా ఖనిజ రవాణా చేస్తే చర్యలు


పట్టుబడిన ఖనిజ రవాణా లారీ

కర్నూలు న్యూసిటీ : అక్రమంగా ఖనిజ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని గనులు, భూ గర్భ ఖనిజాల శాఖ ఉప సంచాల కులు రాజశేఖర్ హెచ్చరించారు. డోన్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో డోలమైట్ రవాణా చేస్తున్న రెండు లారీలను పట్టుకున్నారు. వాటిని శుక్ర వారం పోలీస్ స్టేషన్‌కు తరలించి యజమానులను పిలిపించి రూ.లక్ష ఫైన్ విధించారు. వాహనాల తనిఖీల్లో బాలు నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

కరెంట్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు


కరెంట్ పోల్‌ను ఢీకొని ఆగిపోయిన బస్సు

శ్రీశైలం: శ్రీశైలా నికి 5 కిలోమీటర్ల దూరంలో ముఖ ద్వారం సమీపం లో యాదగిరి గుట్ట డిపోకు చెం దిన తెలంగాణ ఆర్టీసీ బస్సు (టీఎస్30 జెడ్ 0017) ప్రమాద వశాత్తు కరెంటు స్తంభాన్ని ఢీకొం ది. వెంటనే కరెంట్ ట్రిప్ కావడంతో ప్రయా ణికులకు ప్రమాదం తప్పింది. శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఈ ఘటన జరిగింది. స్థానిక విద్యుత్ శాఖ అధికా రులు, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


బాలలింగమయ్య (ఫైల్)

శిరివెళ్ల: కర్నూలు- కడప 40వ జాతీయ రహదారిపై గోవింద పల్లె- శిరివెళ్ల మెట్ట వద్ద జరి గిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళితే.. గుం ప్రమాన్‌దిన్నెకు చెందిన ఊసోల్ల బాలలింగమయ్య (35) నంద్యాలలోని ఓ ఐరన్‌మార్ట్‌లో వర్కర్‌గా పని చేస్తాడు. ప్రతి రోజు ఉదయం బైక్‌పై నం ద్యాలకు వెళ్లి తిరిగి రాత్రి ఇంటికి వస్తాడు. శుక్ర వారం పని ముగించుకుని ఇంటికి వస్తుండగా గోవిందపల్లె- శిరివెళ్ల మెట్ట వద్ద రాంగ్ రూట్‌లో ఓ బైక్ ఎదురొచ్చి ఢీకొట్టి వెళ్లింది. ఈ ఘటనలో తీవ్ర గాయాలైన బాలలింగమయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఇతనికి 5 నెలల కూతురు ఉం ది. భార్య మల్లేశ్వరి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుకు రావడం లేదు!

- మలివయసులో మతిమరుపు సమస్య
- మందులకు లొంగని మహమ్మారి
- కుటుంబ సభ్యుల సేవలు కీలకం
- నేడు ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవం

మనిషికి మతిమరుపు సహజ లక్షణం . అయితే, వృద్ధాప్యంలో ఇది ఎక్కు వగా కనిపిస్తోంది. ఇందుకు అనేక కారణాలు దోహదం చేస్తాయి. ఈ సమస్యను అధిగమించడానికి సరైన పోషకాహారంతో పాటు క్రమం తప్ప కుండా వ్యాయామం అవసరమని వైద్యులు సూచిస్తున్నారు. నేడు ప్రపంచ అల్జీమర్స్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.



కర్నూలు(హాస్పిటల్): వయస్సు పైబడిన వారిలో కనిపించేమతిమరుపునే వైద్యపరిభాషలో అల్జీమర్స్ అంటారు. 1901లో జర్మన్ వైద్యుడు అలోయిస్ అల్జీమర్ ఈ వ్యాధిని గుర్తించారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మానసిక విభాగం , న్యూరాలజి విభాగాలకు ప్రతి ఓపీకి అల్జీమర్స్‌తో వచ్చే వారి సంఖ్య 20 నుంచి 25 మంది దాకా ఉం టున్నట్లు వైద్యుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ ఆసుపత్రితో పాటు ప్రైవేటు ఆసుపత్రులు, క్లిని క్‌లలోని సైకియాట్రిస్టులు, న్యూరోఫిజీషియన్‌ల వద్దకు రోజుకు మరో 50 మంది దాకా చికిత్స కోసం వస్తుంటారు. ఈ మేరకు రోగులను, వారి వ్యాధి లక్షణాలను పరీక్షించి అది సాధారణ మతిమరుపా లేక అల్జీమర్స్ వ్యాధా అని నిర్ధారించి వైద్యులు చికిత్స ఇస్తున్నారు. అల్జీమర్స్ అయితే రోగిని ఎలా సంరక్షించాలో కుటుంబ సభ్యులకు తగిన సూచ నలు చేస్తారు. కానీ ఒక్కోసారి డిమెన్షియాతో బాధ పడే వారిని ఆసుపత్రిలో చేర్చాల్సి ఉంటుంది. ఆసు పత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యాక ఇంట్లో వారిని పర్యవే క్షించాలంటే కుటుంబసభ్యులకు చాలా ఓర్పు, సహనం అవసరం. బాధితులపై మమకారం, ప్రేమాభిమానాలు ఉంటేనే వారిని జాగ్రత్తగా చూసుకోగలరు. కానీ నేటి సమాజంలో ఇవి తగ్గిపో వడంతో అల్జీమర్స్, డిమెన్షియా వచ్చిన వారు నిర్ల క్ష్యానికి గురై త్వరగా మరణిస్తున్నారు.

అల్జీమర్స్ ఏ వయస్సులో వస్తుందంటే...!

మతిమరుపు జబ్బుల్లో అల్జీమర్స్ చాలా ముఖ్యమైన ది. 65 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి 9 మం దిలో ఒకరు ఈ వ్యాధికి గురయ్యే అవకాశం ఉంది. అయితే ఇది వృద్ధులకు మాత్రమే పరిమితమైన వ్యాధి కాదు. పలు సందర్భాల్లో 40-50 సంవ త్సరాల వయస్సు ఉన్న వ్యక్తుల్లో కూడా అల్జీమర్స్ వ్యాధి కనిపిస్తుంది. పురుషులతో పోలిస్తే మహిళ లకు ఈ వ్యాధి ప్రమాదం ఎక్కువ.

ఈ వ్యాధికి ప్రధాన కారణం

మెదడులోని నాడీ కణాల్లో అమిలాయిడ్ బీటా పెప్టైడ్(న్యూరోటాక్సిన్ మాలిక్యూల్స్) చేరడం వల్ల నాడీ కణాలు నశించి వ్యాధి లక్షణాలు ప్రారంభమ వుతాయి. ఇందులో బీపీ పెరగడం, డయాబెటీస్ ఉండటం, ఎక్కువ చెడు కొలెస్ట్రాల్ రక్తంలో ఉండ టం, తలకు గాయాలు అవ్వడం, గుండె సమస్యలు, ఊబకాయం, బ్రెయిన్‌స్ట్రోక్ వంటి జబ్బులు ముందు గానే రావడం ఈ జబ్బుకు కారణం కావచ్చు. జన్యు పరమైన కారణాలు కూడా ఈ జబ్బుకు కారణమవు తాయి. కుటుంబంలో అల్జీమర్స్ జబ్బు ఉంటే తర్వాత తరాల్లో వచ్చే అవకాశం 10 నుంచి 30 శాతం వరకు ఉంటుంది. కొన్ని రకాల మందులు ముఖ్యంగా నిద్రమాత్రలు, జలుబుకు వాడే మం దులు, యాంటి కొలెనార్జిక్ మందులు ఎక్కువగా వాడటం మతిమరుపునకు దారి తీస్తుంది.

నిర్ధారించడం ఎలా...?

అల్జీమర్స్ వ్యాధిని నిర్ధారించేందుకు క్లినికల్ లక్షణా లను బట్టి, క్లినికల్ పరీక్షల సహాయంతో వైద్యులు గుర్తిస్తారు. బ్రెయిన్ ఇమేజింగ్ వంటివి అవసరమ వుతాయి. కొన్నిసార్లు జబ్బు ప్రాథమిక దశలో ఉన్న ప్పుడు అమైలాయిడ్ పెట్‌స్కాన్ లాంటివి అవసర మవుతాయి.

నివారణ చర్యల్లో కొన్ని

- అల్జీమర్స్‌ను నివారించేందుకు నిరూపితమైన మార్గం లేదు. అయితే ఈ చర్యలు సహాయంగా ఉండవచ్చు.
- దూమపానం, మద్యపానం తీసుకోవడం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలి.
- బీపీ, షుగర్, గుండెజబ్బులు రాకుండా చూసుకోవాలి. ఉంటే నియంత్రణలో ఉంచుకోవాలి.
- ఒబెసిటీ రాకుండా చూసుకోవాలి. ఉంటే తగ్గించుకోవాలి.
- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. యోగా, ధ్యానం లాంటి పద్ధతులను అనుసరించాలి.
- పండ్లు, కూరగాయలు అధికంగా ఉండే సమతుల ఆహారం తీసుకోవాలి.
- సామాజిక కార్యక్రమాల్లో నిరంతరం పాల్గొనడం వల్ల నాడీ కణాలు మధ్య సంబంధాలు బలపడి మెదడు చురుగ్గా పనిచేస్తుంది.

పెద్దాసుపత్రిలో మందులు, కౌన్సెలింగ్ ఉచితం



వ్యాధి లక్షణాలను బట్టి చికిత్స, కౌన్సిలింగ్ ఇస్తుంటాము. రోగికి మందులు అందించడం, వారిని చూసుకోవడంలో కుటుంబసభ్యుల పాత్ర కీలకం . బాధితులు దైనందిన కార్య క్రమాలు చాలా వరకు మరిచిపోతుంటారు.అలాంటి వాటిని కుటుంబసభ్యులు గుర్తుచేస్తూ సాయం చేయా లి. ఇందుకు ఎంతో ఓర్పు, సహనం అవసరం. అల్జీ మర్స్ బాధితులకు ఆసుపత్రిలో మందులు, కౌన్సిలిం గ్‌ను ఉచితంగా అందజేస్తున్నాము.

–డాక్టర్ డి. గంగాధర్‌నాయక్, సైకియాట్రిస్ట్, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

రోగికి కుటుంబ సభ్యుల సహకారం తప్పనిసరి



అల్జీమర్స్ జబ్బుకు పూర్తిగా నయం చేసే వైద్యం లేదు. వ్యాధిని ప్రారంభదశలో గుర్తిం చినప్పుడు మందులు, కుటుం బసభ్యుల సహకారం వల్ల అల్జీ మర్స్ వ్యాధి లక్షణాలు పెరగ కుండా చూసుకోవచ్చు. ఈ వ్యాధికి సంబంధించి ప్రస్తుతం కొలివెస్ట్రేజ్ మందులు, మెమంటైన్ అనే మందులు అందుబాటులో ఉన్నాయి. కొన్నిసార్లు మానసిక వైద్యుల సహకారం అవసరం అవుతుంది. ఫిజియోథెరపి, అక్యుపేషనల్ థెరపీ వంటివి కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

–డాక్టర్ చల్లేపల్లె బాబురావు,న్యూరాలజిస్టు, కర్నూలు

మరో ఐదుగురు విద్యార్థినుల అస్వస్థత


ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు


హాస్టల్‌లో విద్యార్థినులతో మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

ఆదోని సెంట్రల్: పట్టణంలోని బీసీ బాలికల జూనియ ర్ కళాశాల వసతి గృహానికి చెందిన మరో ఐదుగురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఇంటర్ చదువుతున్న రాజేశ్వరి, లేఖ, మహాలక్ష్మీ, శిరిష, సింధు అనే ఐదుగురు విద్యార్థినులు శుక్రవారం హాస్టల్‌లో టిఫిన్ చేసి కళాశాలకు వెళ్లారు. అక్కడ కొద్దిసేపటికే కళ్లు తిరుగుతున్నాయని కొందరు, తలనొప్పి అంటూ మరికొందరు కూర్చుండిపోయారు. కళాశాల ప్రిన్సిపా ల్ సంజన్న, అధ్యాపకులు స్పందించి వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శివరాముడు ఆసు పత్రికి వెళ్లి విద్యార్థినులను పరామర్శించి ఆసుపత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస నాయక్‌తో మాట్లాడి వా రి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.త్వరగా కోలుకునేలా మెరుగైన వైద్యం అందించాలని కోరారు. తర్వాత ఆసుపత్రి సూపరింటెండెంట్ వసతి గృహానికి వెళ్లి అక్కడి పరిసరాలను పరిశీలించారు. విద్యార్థినుల తోమాట్లాడి అస్వస్థతకు గలకారణాలను ఆరా తీశారు.

సరైన వసతులు లేవు

వసతి గృహంలో ఇంటర్, ఒకేషనల్, డిగ్రీ చదువు తున్న 132 మంది విద్యార్థినులు ఉన్నారు. అయితే, హాస్టల్‌లో సరైన సౌకర్యాలు లేవని, వారానికి ఒక సారి నీళ్లు వస్తాయని, సంపునీరే తాగుతున్నామని విద్యార్థినులు అధికారుల ఎదుట వాపోయారు. భో జన సదుపాయం కూడా సరిగా లేదని, రాత్రిపూట దోమల బెడద ఎక్కువగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన తాగు నీరు అందించేలా చూడాలని కోరారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఆసుపత్రి సూప రింటెండెంట్ విద్యార్థినులకు భరోసా ఇచ్చారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


తుమ్మల మద్దిలేటి (ఫైల్)

మద్దికెర : మండల కేంద్రానికి చెందిన తుమ్మల మద్దిలేటి (34) అనే రైతు అప్పుల బాధలు తాళలేక శుక్రవారం తెల్ల వారుజామున ఇంట్లో ఉరివేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే తుమ్మల మద్దిలేటి తన కున్న రెండున్నర ఎకరాలతో పాటు మరింత పొలాన్ని కౌలుకు చేసుకుంటున్నాడు. కొన్నేళ్లుగా పంటలు సాగు చేస్తున్నాడు. సకాలంలో పంటలు చేతికందకపోవడం, దిగుబడి వచ్చిన ప్పుడు గిట్టుబాటు ధరలు లేక దాదాపు రూ.20 లక్షలు అప్పులు చేశాడు. ఇందులో పొలాన్ని అమ్మి రూ.14 లక్షల వరకు అప్పు తీర్చాడు. తర్వాత భార్యతో పాటు పిల్లల్ని తీసుకొని భార్య పుట్టిల్లు బొందిమడుగులకు వెళ్లి అక్కడే ఉన్నారు. భార్య ఊరు నుంచి గురు వారం రాత్రి ఒక్కడే వచ్చి మిగతా అప్పులు ఎలా తీర్చాలనే బెంగతో ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందాడు. తెల్లవారు జామున ఎంతకీ తలుపు తీయకపో వడంతో అన్నదమ్ములు పగులగొట్టి చూడగా ఉరి వేసుకొని మృతి చెందాడు. మృతుడికి భార్య రమాదేవి, కొడుకు, కూతురు వున్నారు. మద్దికెర ఏఎస్ఐ చెన్న, కానిస్టేబుల్ చం ద్ర అక్కడకి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ..


మృతుడు ఎల్ల సుబ్బయ్య

బనగానపల్లె రూరల్ : మండలంలోని పలుకూరు గ్రామంలో విద్యుదాఘాతానికి గురై ఓ రైతు మృతి చెందాడు. నందివర్గం ఎస్ఐ బీటి వెంకటసుబ్బయ్య తెలిపిన వివరాల మేరకు.. అంగజాళ్ల ఎల్ల సుబ్బయ్య (54) పొలంలో కంది పంట సాగు చేశాడు. శుక్రవారం అందులో సేద్యం పనికి వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ తీగాలు గుంటికకు తగ లడంతో అక్కడికక్కడే షాక్‌కు గురై మృతి చెం దాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ సం ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి మృతదే హాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు సంతానం.

ప్రత్యేక అవసరాల పిల్లలకు డిజిటల్ విద్య

కర్నూలు సిటీ: ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు డిజిటల్ విద్య అందించేందుకు విజన్-2025 కార్య క్రమాన్ని విద్యాశాఖ ప్రారంభించినట్లు సమగ్ర శిక్ష సహిత విద్య రాష్ట్ర సమన్వయకర్త అమ్మి, రాష్ట్ర పరి శీలకులు కల్పనశైలా తెలిపారు. సమగ్ర శిక్ష ఆధ్వ ర్యంలో శుక్రవారం సహిత విద్య వనరుల టీచర్ల (ఐఈఆర్టీ)కు ట్యాబ్‌ల వినియోగంపై బోధన చేసేందుకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్థానిక హార్ట్ హెల్త్ ఫౌండేషన్ భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వారు మాట్లా డారు. కార్యక్రమంలో ఐఈఆర్టీ జిల్లా కో-ఆర్డినే టర్ సురేష్ రాజు, స్టేట్ రిసోర్స్ పర్సన్ సునీల్, తదితరులు పాల్గొన్నారు.

పక్కాగా జనన, మరణ ధ్రువీకరణ

కర్నూలు (టౌన్) : జనన, మరణ ధ్రువీకరణ నమోదు పక్కాగా చేపట్టాలని జిల్లా వైద్య శాఖ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్ శుక్రవారం కమిషనర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. కర్నూలు నగరపాలక సంస్థ తో పాటు ఎమ్మిగనూరు, ఆదోని, గూడూరు మున్సి పాల్టీలలో సీఆర్ఎస్ (సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్) హెచ్ఎంఐఎస్ (హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) పోర్టల్లో ప్రైవేటు ఆసు పత్రులు, నర్సింగ్ ఆసు పత్రులకు సంబంధించి సమాచార సేకరణలో సమస్యలు వస్తున్నాయ న్నారు.

పత్తించుకునే వారు లేక!


ఆదోని మార్కెట్ యార్డులో పత్తి దిగుబడుల కాటా కోసం ఎదురు చూస్తున్న రైతులు

- దిగుబడులకు టెండర్ ధర ప్రకటనలో వ్యాపారులు తీవ్ర ఆలస్యం
- ఇబ్బందులు పడిన రైతులు

ఆదోని అర్బన్: రైతులు కష్టపడి పండించిన పంట దిగుబడులను అమ్ముకునేందుకు కూడా అవస్థలు పడాల్సి వస్తోంది. గంటల తరబడి వ్యాపారుల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి నెలకొంది. ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డులో పత్తికి టెం డర్ ధర వేయడంలో వ్యాపారులు తీవ్ర ఆలస్యం చేశారు. సాధారణంగా ఉదయం 10 గంటల నుం చి 11 గంటల్లోపు టెండర్ ధర వేయాలి. అయితే, శుక్రవారం రోజు ఏకంగా సాయంత్రం 4.30 గం టల సమయంలో టెండర్ ధర ప్రకటన ప్రారం వచ్చింది. అప్పుడు పత్తి దిగుబడి కాటా మొదలు పెడితే రాత్రి 8.30 గంటల వరకు సమయం పట్టిం ది. వివిధ ప్రాంతాల నుంచి మార్కెట్‌కు శుక్రవారం తెల్లవారుజామునే దిగుబడులు తీసుకొచ్చిన రైతులు రాత్రి వరకు ఎదురుచూడాల్సి వచ్చింది. ఆ సమయంలో తిరిగి ఇంటికి వెళ్లలేక కొందరు బస్టాం డ్‌లో..మరికొందరు లాడ్జీల్లో పడుకున్నారు. మరోసారి ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుం డా వ్యాపారులు త్వరగా టెండర్ వేసేలా మార్కెట్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరు తున్నారు.

యార్డుకు 11,627 క్వింటాళ్ల పత్తి దిగుబడులు

ఆదోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు శుక్రవారం పత్తి దిగుబడులు భారీగా వచ్చాయి. 5,819 పత్తి చెక్కులు రాగా అందులో 11,627 క్వింటాళ్ల పత్తి ఉంది. క్వింటం గరిష్ట ధర రూ.8,139, మధ్య ధర రూ.7,769, కనిష్ట ధర రూ.4,489గా నమోదైంది.

ఉపాధి నిధులతో అప్రోచ్ రోడ్లు

- ఇప్పటికే 21 మండలాల్లో రూ.42 కోట్లతో సీసీ రోడ్లకు పరిపాలన అనుమతులు

కర్నూలు(అగ్రికల్చర్):జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో అప్రోచ్ రోడ్లు కూడా వేయడానికి రంగం సిద్ధమైంది. ఇప్పటికే మొదటి విడతలో ఉపాధి నిధులతో 21 మండలాల్లో సీసీ రోడ్లు వేయడానికి జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పరిపాలన అనుమతులు ఇచ్చారు. మంత్రాలయం నియోజక వర్గం నుంచి సీసీ రోడ్లకు ప్రతిపాదనలు రావాల్సి ఉంది. కాగా రూ.14 కోట్ల ఉపాధి నిధులతో అప్రోచ్ రోడ్లు వేయడానికి గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు ఇచ్చింది. దీంతో జిల్లా నీటి యాజమాన్య సంస్థ అన్ని మండలాల నుంచి ప్రతిపాదనలు పంపాలని ఎంపీడీవోలను కోరింది. పశువుల షెడ్లకు కూడా ఎస్టిమేట్లు వేయాలని డ్వామా పీడీ ఏపీఓలను ఆదేశించారు. జిల్లాలో 1200 పశువుల షెడ్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కాగా సీసీ రోడ్లు, అప్రోచ్ రోడ్ల పనుల నిర్వహణను టీడీపీ గ్రామ, మండల స్థాయి నేతలకు అప్పగించనున్నారు. పశువుల షెడ్లు కూడా సంబంధిత ఎమ్మెల్యే, మండల టీడీపీ నేతలు చెప్పిన సూచించిన వారి దరఖాస్తులనే పరిగణలోకి తీసుకుంటున్నారు.

'చెప్పు'కోండి చూద్దాం !



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రధాన విభాగాల్లో రోగుల తాకిడి అధికంగా ఉం టుంది. ముఖ్యంగా క్యాజువాలిటీ, కార్డియాలజీ, న్యూరోసర్జరీ, యురాలజీ, చిన్నపిల్లల విభాగం, గైనకాలజీ, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ వంటి విభాగాల్లో ఈ పరిస్థితి ఎక్కువగా ఉంటుంది. వాస్త వంగా వార్డుల్లో బయట నుంచి వచ్చిన వారు చెప్పులు వేసుకుని తిరగకూడదు. అలా తిరిగితే రోగులకు ఇన్‌ఫెక్షన్ అధికమై ప్రాణాంతకమయ్యే అవకాశం ఉంటుంది. అలాగని చెప్పులను బయట వదిలి వెళితే తిరిగి వచ్చేలోపు ఏ చెప్పు ఎక్కడ ఉం టుందో తెలియని పరిస్థితి. జతలోని ఓ చెప్పు కని పిస్తే మరొకటి కనిపించదు. దీంతో ఒక చెప్పును తీసుకెళ్లలేక చాలా మంది అక్కడే వదిలేసి వెళ్త న్నారు. పై చిత్రంలో కనిపిస్తున్నది కార్డియాలజి విభాగం వద్ద అలా వదిలేసిన చెప్పుల కుప్పే. ప్రధాన విభాగాల వద్ద చెప్పులను ఉంచేందుకు స్టాండ్‌లు ఏర్పాటు చేస్తే ఈ పరిస్థితి ఉండదని రోగులు సూచిస్తున్నారు. – కర్నూలు(హాస్పిటల్)


ట్రాక్టరు ట్రాలీలో పెట్టుకొని మొక్కజొన్న కంకులను విక్రయిస్తున్న రైతు

వ్యవసాయం 'దెబ్బతిని' !

భారీ వర్షాలు మొక్కజొన్న పంట దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపాయి. దీంతో కంకులు చాలా వరకు దెబ్బతిన్నాయి. దిక్కుతోచని రైతులు కనీసం పంట పెట్టుబడులైనా వస్తాయని కంకులను కోసి ట్రాక్టరులో పెట్టుకోని విక్రయిస్తున్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు ప్రాంతానికి చెందిన ఓ రైతు శుక్రవారం దొర్నిపాడు, ఆళ్లగడ్డ, శిరివెళ్ల, చాగలమర్రి తదితర ప్రాంతాల్లో తిరుగుతూ రూ.50కి ఆరు మొక్కజొన్న కంకులను కవర్లో పెట్టి ఇస్తు న్నాడు. ఇంకోటి ఇవ్వవా అని ఎవరైనా అడిగితే ఇస్తున్నాడు. కానీ మార్కెట్‌లో మాత్రం అదే కంకిని కాల్చి ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.50 వరకు విక్రయించి వ్యాపారులు సొమ్ముచేసుకుంటున్నారు. పై చిత్రం ఈ ఏడాది మొక్కజొన్న రైతు దయనీయ పరిస్థితికి అద్దంపడుతోంది. – దొర్నిపాడు